## తొమ్మిదవరోజు పారాయణము

సప్తదశాధ్యాయము

పూర్వోక్త ఉద్భూత పురుషునికి అంగీరసుడిలా ఉపదేశిస్తున్నాడు. నాయనా! ఒకప్పుడు కైలాసములో పార్వతీదేవికి శివుడు చెప్పిన విషయాలనే నీకిప్పుడు చెప్పబోతున్నాను - శ్రద్ధగా విను.

ఉద్భూత పురుషునకు అంగీరసుడు చేసిన ఆత్మజ్ఞానబోధ

శ్లో॥ కర్మబంధశ్చ ముక్తిశ్చ కార్యంకారణ మేవ చ
స్థూలసూక్ష్మం తథా ద్వంద్వ సంబంధో దేహముచ్చతే ॥

కర్మబంధము, ముక్తికార్యము, కారణము - స్థూల సూక్ష్మము, ఈ ద్వంద్వ సంబంధితమే, దేహమనబడుతూంది.

శ్లో॥ అత్రబ్రూమ స్సమాధానం కోన్యోజీవస్త్వమేవహి
స్వయం పృచ్ఛసిమాంకోఽహం బ్రహ్మైవాస్మి న సంశయః ॥

జీవుడంటే వేరెవరూ కాదు, నీవే అప్పుడు - 'నేనెవర్ని?' అని నిన్ను నువ్వే ప్రశ్నించుకుంటే నేనే బ్రహ్మనై వున్నాను. ఇది నిశ్చయము' అనే సమాధానమే వస్తుంది.
పురుష ఉవాచ: 'అంగీరసా! నువ్వు చెప్పిన వాక్యార్థ జ్ఞానము నాకు తట్టడం లేదు. నేనే 'బ్రహ్మను' అనుకోవడానికైనా బ్రహ్మ అనే పదార్థమును గురించి తెలిసి వుండాలి గదా! ఆ పదార్థ జ్ఞానము కూడా లేనివాడనైన నాకు - మరింత వివరముగా చెప్పమని కోరుతున్నాను.'
అంగీరస ఉవాచ: అంతఃకరణానికీ, తద్వ్యాపారాలకీ, బుద్ధికీ సాక్షి - సత్, చిత్ ఆనందరూపీ అయిన పదార్థమే ఆత్మ అని తెలిసికొనుము. దేహము కుండవలె రూపాదివత్‌గా వున్న పిండ శేషమూ - ఆకాశాది పంచభూతాల వలన పుట్టినదీ అయిన కారణముగా - ఈ శరీరము ఆత్మేతరమైనదే తప్ప - 'ఆత్మ' మాత్రము కాదు. ఇదే విధముగా ఇంద్రియాలుగాని, అగోచరమైన మనస్సుగాని, అస్థిరమైన ప్రాణముగాని - ఇవేవీ కూడా 'ఆత్మ' కాదు - అని తెలుసుకో. దేనివలనైతే దేహింద్రియాదులన్నీ భాసమానాలవుతున్నాయో అదే 'ఆత్మ'గా తెలిసికొని - ఆ 'ఆత్మపదార్థమే నేనై వున్నాను' అనే విచికిత్సను పొందు. ఏ విధంగానైనా అయస్కాంతమణి తాను ఇతరాల చేత - ఆకర్షింపబడకుండా - ఇనుమును తానాకర్షిస్తుందో - అదే విధంగా - తాను నిర్వికారియై బుద్ధ్యాదులను సైతము చలింప చేస్తున్నదే దానిని ఆత్మవాచ్యమైన

'నేను'గా గుర్తించు. దేని సాన్నిధ్యము వలన జడాలైన దేహేంద్రియ మనఃప్రాణులు భాసమానాలౌతున్నాయో - అదే జనన మరణ రహితమైన ఆత్మగా భావించు. ఏదైతే నిర్వికారమై - నిద్రాజాగ్రత్ స్వప్నాదులనూ, వాటి ఆద్యంతాలనూ గ్రహిస్తున్నదో అదే నేనుగా స్మరించు. ఘటాన్ని ప్రకాశింప చేసే దీపం ఘటితమైనట్లే - దేహేతరమై 'నే'నబడే ఆత్మ చేతనే దేహాదులన్నీ భాసమానాలవుతాయి. సమస్తమూ పట్లా ఏర్పడుతూండే అనూహ్, అగోచర ప్రేమైకారమే నేనుగా తెలుసుకో, దేహేంద్రియ మనః ప్రాణాహంకారాల కంటే విభిన్నమైనదీ - జనితత్వ అస్తిత్వ వృద్ధిగతత్వ, పరిణామత్వ, క్షీణత్వ, నాశంగతత్వాలనే షడ్వికారాలు లేని దానినే ఆత్మగా - అదే నీవుగా ఆ నీవే నేనుగా - నేనే నీవుగా 'త్వమేవాహం'గా భావించు. ఈ విధంగా 'త్వం' (నీవు అనే పదార్థ జ్ఞానాన్ని పొంది, తత్కారణాత్ వ్యాపించే స్వభావము వలన సాక్షాద్విధిముఖంగా తచ్ఛబ్దార్థాన్ని గ్రహించాలి ('తత్' శబ్దానికి 'బ్రహ్మ' అని అర్థము).

శ్లో// అతద్వ్యావృత్తిరూపేణ సాక్షాద్విధి ముఖేన చ
వేదాంతానాం ప్రవృత్తిః స్యాత్ ద్విరాచార్య సుభాషితమ్ //

'అతః' శబ్దానికి బ్రహ్మణమైన ప్రపంచమని అర్థం. 'వ్యావృత్తి అంటే - ఇది కాదు - ఇదీ కాదు - (నేతి-న+ఇతి, న+ఇతి=ఇదీకాదు) అనుకుంటూ - ఒకటొకటిగా ప్రతిదానినీ కొట్టిపారవేయడం - అంటే, ఈ చెయ్యి 'బ్రహ్మ (ఆత్మ)' కాదు. ఈ కాలు 'ఆత్మ (బ్రహ్మ)' కాదు. అనుకుంటూ - 'ఇది కాక పోతే మరి 'అది' ఏది? అని ప్రశ్నించుకుంటూ పోగా పోగా మిగిలేదే 'బ్రహ్మ' (ఆత్మ) అని అర్థం. ఇక - సాక్షా ద్విధిముఖాత్ అంటే - 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' అనే వాక్యాల ద్వారా సత్యత, జ్ఞానం, ఆనందాలవల్లనే - 'ఆత్మ' నరయగలగాలని అర్థము. ఆ 'ఆత్మ' సంసార లక్షణావేష్టితం కాదనీ, సత్యమనీ, దృష్టిగోచరము కాదనీ, చీకటిని ఎరుగనిదనీ - లేదా - చీకటికి అవతలిదనీ, పోల్చి చెప్పడానికి వీలు లేనంతటి ఆనందమయమనీ, సత్య ప్రజ్ఞాది లక్షణయుతమనీ, పరిపూర్ణమనీ - పూర్వోక్త సాధనల వలన తెలుసుకో. అబ్బాయి!

దేనినైతే 'సర్వజ్ఞం పరేశం సంపూర్ణ శక్తిమంతం' గా, వేదాలు కీర్తిస్తున్నాయో - ఆ బ్రహ్మ 'నేనే'నని గుర్తించు. ఏదీ తెలుసుకుంటే అన్నీ తెలిసిపోతాయో - అదే ఆత్మ. అదే నువ్వు. అదే నేను. 'తదనుప్రవిశ్య' ఇత్యాది వాక్యాల చేత జీవాత్మరూపాన జగత్ప్రవేశమూ - ప్రవేశిత జీవులను గురించిన నియంతృత్వము - కర్మ ఫలప్రదత్వమూ - సర్వజీవ కారణ కర్తృత్వమూ - దేనికైతే చెప్పబడుతూ వుందో -అదో

'బ్రహ్మ'గా తెలుసుకో. 'తత్త్వమసి'=తత్ అంటే బ్రహ్మ, లేదా ఆత్మ - త్వం అంటే నువ్వే - అనగా - నువ్వే - అనగా పరబ్రహ్మమని అర్థం. ఓ జిజ్ఞాసూ! అద్వయానంద పరమాత్మయే ప్రత్యగాత్మ. ఈ ప్రత్యగాత్మే ఆ పరమాత్మ - ఈ ప్రకారమైన తాదాత్మ్యత ఏనాడు సిద్ధిస్తుందో - అప్పుడు మాత్రమే 'తత్' శబ్దార్థం తనేననీ, 'త్వం' శబ్దము సాధనమే గాని ఇతరం గాదనీ తేలిపోతుంది. నీకు మరింత స్పష్టముగా అర్థమవడం కోసం చెబుతున్నాను విను. తత్త్వమసి=తత్+త్వం+అసి. ఈ వాక్యానికి అర్థం తాదాత్మ్యము అనే చెప్పాలి. ఇందులో వాక్యార్థాలైన కించిజ్ఞత్వ, సర్వజ్ఞతా విశిష్టులైన జీవేశ్వరులను ప్రక్కనబెట్టి - లక్ష్యార్థాలైన ఆత్మలనే గ్రహించినట్లయితే 'తాదాత్మ్యము' సిద్ధిస్తుంది. (ముఖ్యార్థ వేధా శంక కలిగితే లక్షణావృత్తి నాశ్రయించాలి. అందులో 'భాగ లక్షణ' అనే దాని వలన ఇది సాధింపబడుతూ వుంది (ఉదా// సో2యం దేవదత్తః ఆత్మసంపన్నః). 'అహం బ్రహ్మ2స్మి' అనే వాక్యార్థబోధ స్థిరపడే వరకూ కూడా శమ దమాది సాధన సంపత్తితో - శ్రవణమనదికాలను ఆచరించాలి. ఎప్పుడైతే శ్రుతివల్లనో, గురు కటాక్షము వల్లనో తాదాత్మ్యబోధ స్థిరపడుతుందో, అప్పుడీ వర్తమాన సంసార లంపటము దానికదే పుటుక్కున తెగిపోతుంది. అయినా కొంత కాలము ప్రారబ్ధకర్మ పీడిస్తూనే వుంటుంది. అది కూడా క్షయమవడంతో పునరావృత్తి రహితమైన స్థాయిని చేరతాము. దానినే ముక్తి - మోక్షము అంటారు. అందువల్ల, ముందుగా చిత్తశుద్ధి కోసం కర్మిష్ఠులుగా వుండి, తత్ఫలాన్ని దైవార్పణము చేస్తూండడం వలన - ప్రారబ్ధాన్ననుసరించి ఆ జన్మలోనే గాని, లేదా - ప్రారబ్ధ కర్మ ఫలము అధికమైతే మరుజన్మలోనైనా వివిధ మోక్షవిద్యాభ్యాసపరులై, జ్ఞానులై, కర్మబంధాల్ని త్రెంచుకుని ముక్తులవుతారు - 'నాయనా! బంధించేవి - ఫలవాంఛిత కర్మలు. ముక్తినిచ్చేవి - ఫలపరి త్యాగకర్మలు' అని ఆపాడు అంగీరసుడు.

సప్తదశాధ్యాయ స్సమాప్తః (పదునేడవ అధ్యాయము)

## అష్టాదశాధ్యాయము

అంగీరసుడు చెప్పింది వినిన -ఉద్భ్రాంత పురుషుడు కర్మయోగాన్ని గురించి ప్రశ్నించడంతో -

అంగీరసుడిలా చెబుతున్నాడు: చక్కటి విషయాన్ని అడిగావు. శ్రద్ధగా విను. సుఖ దుఃఖాది ద్వంద్వాలన్నీ దేహానికేగాని, తదతీతమైన ఆత్మకు లేవు. ఎవడైతే ఆత్మానాత్మ

సంశయగ్రస్తుడో వాడు మాత్రమే కర్మలను చేసి, తద్వారా చిత్తశుద్ధిని పొందిన వాడై ఆత్మజ్ఞాని కావాలి. దేహధారియైన వాడు తన వర్ణాశ్రమ విద్యుక్తాలయిన స్నానశౌచాదిక కర్మలను తప్పనిసరిగా చేసి తీరాలి.

శ్లో॥స్నానేన రహితం కర్మ  హస్తిభుక్త కపిత్థవత్
ప్రాతః స్నానం ద్విజాతీనాం శాస్త్రం చ శ్రుతిచోదితమ్ ॥

స్నానము చేయకుండా చేసే ఏ కర్మ ఐనా సరే - ఏనుగు తినిన వెలగపండులా నిష్ఫలమే అవుతుంది. అందునా - బ్రాహ్మణులకు ప్రాతః స్నానము వేదోక్తమై వుంది. ప్రతి రోజునా ప్రాతః స్నానం చెయ్యలేని వాళ్లు - సూర్యసంచారము కల తులా-కార్తీక మకర-మాఘ మేష-వైశాఖాలలోనైనా - చెయ్యాలి. జీవితంలో ఈ మూడు మాసాలైనా ప్రాతః  స్నానాలు చేసే వాడు సరాసరి వైకుంఠాన్నే పొందుతాడు. చాతుర్మాస్యాది పుణ్యకాలాలలోగాని, చంద్ర సూర్యగ్రహణ పర్వాలలోగాని - స్నానము చాలా ప్రధానము. గ్రహణాలలో - గ్రహణకాల స్నానమే ముఖ్యము. సర్వకాలముల  యందు బ్రాహ్మణులకు పుణ్యకాలాలలో సర్వ ప్రజలకు - స్నాన సంధ్యా, జప, హోమ, సూర్యనమస్కారాలు తప్పనిసరిగా చేయవలసి వున్నాయి. స్నానాన్ని వదలిన వాడు రౌరవ నరకగతుడై - పునః కర్మభ్రష్టుడిగా జన్మిస్తాడు. ఓ వివేకవంతుడా!
పుణ్యకాలాలన్నింటా సర్వోత్తమమైనదీ కార్తీకమాసము. వేదాన్ని మించిన శాస్త్రము, గంగను మించిన తీర్థము, భార్యతో సమానమైన సుఖము, ధర్మతుల్యమైన స్నేహము, కంటికంటే వెలుగు -లేనట్లుగానే కార్తీకమాసముతో సమానమైన పుణ్యకాలము గాని, కార్తీక దామోదరునికన్నా దైవముగాని లేడని గుర్తించు, కర్మ మర్మాన్ని తెలుసుకుని కార్తీకములో ధర్మాన్ని ఆచరించేవాడు వైకుంఠమును చేరుతాడు. నాయనా! విష్ణువు - లక్ష్మీసమేతుడై, ఆషాఢశుక్ల దశమ్యంతంలో - పాలసముద్రాన్ని చేరి
నిద్రా మిషతో శయనిస్తాడు. పునః హరిబోధినీ అనబడే కార్తీకశుక్ల ద్వాదశినాడు నిదురలేస్తాడు. ఈ నడుమ నాలుగు మాసాలనే చాతుర్మాస్య (వ్రతము) అంటారు. విష్ణువునకు నిద్రాసుఖప్రదమైన ఈ నాలుగు నెలలూ కూడా ఎవరైతే హరి ధ్యానమును, పూజలను చేస్తుంటారో వాళ్ల పుణ్యాలు అనంతమై, విష్ణులోకాన్ని పొందుతారు. ఈ విషయమై ఒక పురాణ రహస్యాన్ని చెబుతాను విను.
ఒకానొక కృతయుగంలో విష్ణువు లక్ష్మితో సహా వైకుంఠ సింహాసనాన్ని అలంకరించి వుండగా - నారదుడు అక్కడకు వెళ్లి వారికి మ్రొక్కి -

'హే శ్రీహరీ! భూలోకంలో వేదవిధులు అడుగంటాయి. జ్ఞానులు సైతము గ్రామ్యసుఖాలకు లోనై పోతున్నారు. ప్రజలంతా వికర్ములై వున్నారు. వారెలా విముక్తులవుతారో తెలియక నేను దుఃఖితుడనవుతున్నాను' అని విన్నవించాడు. నారదుని మాటలను విశ్వసించిన నారాయణుడు, సతీసమేతుడై, వృద్ధ బ్రాహ్మణ రూపధారియై తీర్థక్షేత్రాదులలోనూ, బ్రాహ్మణ పరిషత్పట్టణాలలోనూ పర్యటించసాగాడు. కొందరు ఆ దంపతులకు అతిథి సత్కారాలు చేశారు. కొందరు హేళన చేశారు. ఇంకొందరు లక్ష్మీనారాయణ ప్రతిమలను పూజిస్తూ వీళ్లను తిరస్కరించారు. కొందరు అభక్ష్యాలను పాపాచరణులనీ చూచిన శ్రీహరి - ప్రజోద్ధరణ చింతనామానసుడై - చతుర్భుజాలతో, కౌస్తుభాది ఆభరణాలతో యధారూపాన్ని పొంది వుండగా - జ్ఞాన సిద్ధుడనే ఋషి తన శిష్యగణ సమేతముగా వచ్చి ఆయనని ఆరాధించాడు. అనేక విధాలుగా స్తుతించాడు.

ఏవం శ్రీస్కాంద పురాణాంతర్గత కార్తీక మహాత్మ్యే
సప్తదశ, అష్టాదశాధ్యాయౌ, (పదిహేడు - పద్దెనిమిదీ అధ్యాయములు)
తొమ్మిదవ రోజు (నవమి) నాటి పారాయణము సమాప్తము